నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | డిసెంబర్ 28, 2023 | www.navatelangana.com

నేటి నుండి గ్రామసభలు

పెంచికల్‌పేట్: నేటి నుండి జనవరి 4 వరకు మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలనపై గ్రామసభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ గంగాసింగ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేయడానికి ఆరు గ్యారెంటీలపై ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామంలో సిబ్బందితో ప్రజలకు సులువైన రీతిలో దరఖాస్తులు స్వీకరించే విధంగా కౌంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. 28న దరోగపెల్లి, ఎలుకపెల్లి, 29న చెడ్వాయి, కొండపెల్లి, 30న పోతపెల్లి, లోడ్‌పెల్లి, జనవరి 2న బొంబాయిగూడ, ఎల్లూర్, 3న కమ్మర్‌గాం, పెంచికల్‌పేట్, 4న మురళీగూడ, అగర్‌గూడ గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశా, ఫీల్డ్ అసిస్టెంట్లు, కారోబార్‌లు పాల్గొన్నారు.



బ్యాంకు పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

జైపూర్ : వినియోగదారుల సౌకర్యార్థం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కుందారం శాఖ మేనేజర్ సంతోష్ సూచించారు. బ్యాంకు ఆధ్వర్యంలో నాబార్డ్ సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం పౌనూర్ గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రూరల్ ఫోక్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం ఆట పాటల ద్వారా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా అమలు చేస్తున్న పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వినియోగదారుల అవసరాల మేరకు రుణ సదుపాయంతో పాటు సామాజిక భద్రత పథకాలు జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాలపై మ్యాజిక్‌షో, ఆటాపాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాడి సారయ్య, బ్యాంకు కుందారం శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజల చెంతకే పాలన..!

- ఉమ్మడి జిల్లాలో నేటి నుంచి 'ప్రజాపాలన' సభలు
- ఆరు గ్యారెంటీల కోసం దరఖాస్తులు స్వీకరణ
- రోజూ రెండు గ్రామాల చొప్పున నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం
- జైనథ్ మండలం జామినిలో ప్రారంభించనున్న సీతక్క
- పల్లెలు, వార్డుల్లో వారం రోజులు సందడి

కొత్త ప్రభుత్వం కొలువుదీరిన పక్షం రోజుల్లోనే ప్రజల్లోకి వెళ్లాలని భావించింది. ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల దరికి చేర్చేందుకు దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి గురువారం నుంచి 'ప్రజా పాలన' పేరిట పల్లెలు, పట్టణాల్లో సభలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు ప్రజల నుంచి ఆయా పథకాల కోసం దరఖాస్తులు తీసుకుంటోంది. సర్కారు ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ఈ సభలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే గ్రామాలు, వార్డులను సందర్శించే బృందాలను సైతం నియమించారు. ప్రభుత్వం రూపొందించిన దరఖాస్తులను పూరించి అధికారులకు అందజేయాలని సూచిస్తున్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు రేషన్‌కార్డులకు సైతం దరఖాస్తులు తీసుకుంటామని స్పష్టం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోంది. ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని భావించింది. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో పాటు ఆరోగ్యశ్రీ రూ.10లక్షలకు వర్తింపు వంటి పథకాలు ప్రారంభించింది. మిగితా వాటిని కూడా వంద రోజుల్లో అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామాలు, వార్డుల్లో ప్రజాపాలన సభలు నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే ఆయా జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులకు ప్రభుత్వం అవగాహన కల్పించింది. జిల్లాల్లో అమలు చేసేలా మార్గదర్శకాలు విడుదల చేసింది. సర్కారు సూచన మేరకు అధికార యంత్రాంగం సభల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క గురువారం జైనథ్ మండలం జామిని గ్రామంలో అధికారికంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

ఒక బృందం..రెండు గ్రామాలు..!

ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఒక్కో బృందం రోజూ రెండు గ్రామాల్లో ఈ సభలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఒకే రోజులో మూడు నుంచి నాలుగు గ్రామాల వరకు సభలు నిర్వహించనున్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇందుకు మండలాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. తహసీల్దార్, ఎంపీడీఓల స్థాయిలో బృందాలను నియమించింది. వీటిలో గ్రామ, మున్సిపల్ స్థాయిలో అధికారులు, సిబ్బంది భాగస్వాములు కానున్నారు. దరఖాస్తులు గ్రామ పంచాయతీ, వార్డు కార్యదర్శి కార్యదర్శి వద్ద లభించేలా ఏర్పాట్లు చేసింది. వీటిని లబ్ధిదారులకు అందజేస్తే ముందుగానే వాటిని పూరించి అధికారులకు అందజేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా సభల వద్ద తాగునీరు, నీడ కోసం టెంట్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకోగానే వారికి రసీదు కూడా ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజాపాలన పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

ఈ పథకాలకు దరఖాస్తులు..!

ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా అమలు చేయనున్న పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించగా.. ఈ పథకంలో మహిళలకు నెలకు రూ.2500చొప్పున అందించడంతో పాటు రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సౌకర్యాలున్నాయి. రైతుభరోసా కింద రైతులు, కౌలు రైతులకు రూ.15వేల ఆర్థిక సాయం, వ్యవసాయ కూలీలకు రూ.12వేలతో పాటు వరి పంటకు రూ.500బోనస్ అందించనుంది. గృహజ్యోతి పథకంలో భాగంగా ప్రతి కుటుంబానికి 200యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం, ఇందిరమ్మఇండ్లు పథకంలో ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం, తెలంగాణ ఉద్యమకారులకు 250చ.గజాల ఇంటి స్థలం, చేయూత పథకంలో భాగంగా ఇప్పటికే రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా రూ.10లక్షలు వర్తింపు, నెలవారీ పింఛన్ రూ.4వేల చొప్పున అందించడం వంటి పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ఆదర్శవంతమైన మార్పు తీసుకురావాలి

- ఉమ్మడి జిల్లా అధికారులతో మంత్రి సీతక్క సమావేశం
- ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు
- నేటి నుండి దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో మానవతాదృంతో బాధ్యతాయుతంగా పని చేసి రాష్ట్రంలో ఒక ఆదర్శవంతమైన మార్పును తీసుకురావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిపారుదల, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమ సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, జిల్లా పరిషత్ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ 6 గ్యారెంటీల అమలు, ప్రజాపాలనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన 6 గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించి విజయవంతం చేసే విధంగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో గ్రామీణ స్థాయి నుండి అభివృద్ధి జరిగే విధంగా క్షేత్ర, మండల, జిల్లా స్థాయి అధికారులు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని ఆదేశించారు. ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా బాలికలు, మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాన్ని లాంచనంగా ప్రారంభించడంతో పాటు రూ.5లక్షలు ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.10లక్షలకు పెంచడం జరిగిందని తెలిపారు. ఈ నెల 28 నుండి జనవరి 6, 2024 వరకు మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, ఇందుకుగాను పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో ప్రజల స్థితిగతులకు అనుగుణంగా సర్వతో ముఖాభివృద్ధి కొరకు కృషి చేయాలని, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం మనం చేసే కృషితో ప్రజల గుండెల్లో ఉండిపోతామని అన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం విశేష కృషి చేసిన హైమన్‌డార్ఫ్ వర్ధంతి వేడుకలను జనవరి 11న అధికారికంగా ఐటీడీఏ నిర్వహిస్తుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుండి వలసలను నియంత్రించడం, ప్రభుత్వ పథకాలను దుర్వినియోగం కాకుండా అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు పర్యవేక్షణ కొరకు ప్రత్యేక అధికారిని నియమించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ గ్యారంటీల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ జిల్లాలో దరఖాస్తుల స్వీకరణకు 1884 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ఎస్పీలు ఉదయ్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, సుధీర్ రాంనాథ్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, దీపక్ తివారి, సబావత్ మోతిలాల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల జిల్లా పరిషత్ చైర్మెన్లు జనార్ధన్ రాథోడ్, కృష్ణారావు, కె. విజయలక్ష్మి, ఖానాపూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు బొజ్జు పటేల్, కోవ లక్ష్మి, గడ్డం వినోద్, ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రజాపాలన కార్యక్రమం

నవతెలంగాణ - దహెగాం

ప్రజల వద్దకే ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులు స్వీకరిస్తామని ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్, తహసీల్దార్ కవిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ఈ నెల 28 నుండి జనవరి 6 వరకు సెలవు దినాల్లో తప్ప మిగతా రోజుల్లో యథాతథంగా నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమం కోసం ఎంపీడీఓ, తహసీల్దార్ లీడర్లుగా టీంలు ఏర్పాటు చేసి ప్రతిరోజు ఒకటి, రెండు గ్రామసభల చొప్పున నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పథకాలను అందించనున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకం క్రింద మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం, రూ.500లకు గ్యాస్ కనెక్షన్, రైతు భరోసా కింద భూమి వివరాలు, గృహజ్యోతి కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, చేయూత కింద అర్హులైనవారికి పెన్షన్, ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు వంటివి ఆరు పథకాలు ఒకే ఫారంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజలు ఎవరి గ్రామాల్లో వారు పంచాయతీ కార్యదర్శుల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, ఏపీఓ కల్పనతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. గ్రామసభలకు సంబంధించిన తేదీలను సైతం ప్రకటించారు. 28న ఐనం, లగ్గాం, పెసరుగుంట, చౌక, 29న బీబ్రా, చంద్రపల్లి, కొత్మీర్, బామానగర్, 30న బోర్లకుంట, ఒడ్డుగూడ, ఇట్యాల, చిన్నరాస్పెల్లి, జనవరి 2న దహెగాం, గెర్రె, కమ్మర్‌పల్లి, గిరవెల్లి, 3న హత్తిని, ఖర్జీ, పీపీరావు కాలనీ, దిగిడ, 4న కొంచవెల్లి, మొట్లగూడ, రాంపూర్, కల్వాడలో గ్రామ సభలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ప్రజాపాలన నోడల్ అధికారిగా ఎం.ప్రశాంతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గురువారం నుంచి ప్రారంభం కానున్న ప్రజాపాలన సభలకు నోడల్ అధికారిగా ఐఏఎస్ అధికారి ఎం.ప్రశాంతిని ప్రభుత్వం నియమించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరిగే ఈ సభలను పర్యవేక్షించేందుకు వీరిని నియమించినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

ఫ్యాక్టరీ పనులు ఆపేదాకా ఉద్యమం

- గుండంపల్లి రైతుల రాస్తారోకో
- తండోపతండాలుగా తరలొచ్చిన మహిళలు
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- కలెక్టర్ వచ్చే వరకూ కదలబోమని భీష్మించుకు కూర్చున్న రైతులు



రోడ్డుపై బైటాయించిన మహిళలు, రైతులు



నవతెలంగాణ -దిలావర్‌పూర్

మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల సరిహద్దు పంట పొలాల్లో ఓ ప్రైవేటు సంస్థ ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీతో ముప్పు పొంచి ఉందనే భావన ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతోంది. చైతన్యం వచ్చిన గ్రామస్తులు ఉద్యమాన్ని ఉధతం చేసేందుకు ముందుకు కదులుతున్నారు. ఫ్యాక్టరీ కోసం అక్రమంగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి కనీసం రైతుల అభిప్రాయ సేకరణ కూడా చేయకుండా ఫ్యాక్టరీ పనులు మొదలుపెట్టారని ఆందోళన వ్యక్తం చేస్తూ బుధవారం గుండంపల్లి గ్రామస్తులు 61 నెంబర్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం ఫ్యాక్టరీ పనులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



పంటపొలాలు, గోదావరి నదిని కాపాడేందుకు దేనికైనా సిద్ధం

ఇథనాల్ ఫ్యాక్టరీ స్థాపనతో చుట్టుపక్కల దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, న్యూలోలం, బన్సపల్లి, సాంగ్వి తదితర గ్రామాలకు అత్యధిక వాయు కాలుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యాల పాలవుతారని రైతులు, మహిళలు పేర్కొన్నారు. ముఖ్యంగా పంటలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. ఫ్యాక్టరీ నుండి వెలువడే వ్యర్థపు నీటితో నదీ జలాలు కలుషితమై జలాచర జీవులు అంతమవుతాయని పేర్కొన్నారు.

ఎన్నికల తర్వాత పనులు పునఃప్రారంభం

ఆరు నెలల క్రితం మండల ప్రజలు నిరసన కార్యక్రమాలు చేయడంతో నిలిపివేసిన ఫ్యాక్టరీ పనులు అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రారంభించడంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఫ్యాక్టరీ పనులు నిలిపేసేందుకు మళ్లీ పోరాటానికి సిద్ధమయ్యారు. రాజకీయ నాయకులు కేవలం ఎన్నికల కోసమే ఫ్యాక్టరీ పనులు ఆపారని, ప్రజలపై ప్రేమతో కాదని ఆగ్రహించారు.

తాత్కాలికంగా పనులు నిలిపేస్తామనే హామీతో ఆందోళన విరమణ

గుండంపల్లి గ్రామానికి చెందిన నాయకులు, రైతులు, యువకులు జాతీయ రహదారి నెం.61 గుండంపల్లి ఎక్స్ రోడ్ వద్ద రాస్తారోకోకు దిగారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించడంతో రహదారికి ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కలెక్టర్ వచ్చి కచ్చితమైన హామీ ఇచ్చే వరకు కదిలే ప్రసక్తే లేదని రోడ్డుపై భీష్మించుకు కూర్చున్నారు. నిర్మల్ సీఐ శ్రీనివాస్, దిలావర్‌పూర్ ఎస్ఐ యాసిర్ అరాఫత్, నర్సాపూర్(జి) ఎస్ఐ రవీందర్ ఘటన స్థలానికి చేరుకొని నాయకులను, రైతులను బుజ్జగించారు. వారు ఒప్పుకోకపోవడంతో ఎంపిడిఓ మోహన్, తహసీల్దార్ సరిత తాత్కాలికంగా పనులు నిలిపేసేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని ఫ్యాక్టరీ పనులు పూర్తిగా నిలిపేయాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతులు, నాయకులు హెచ్చరించారు.

ఎన్నికలు ప్రశాంతం..!

- సింగరేణిలో 95శాతం పోలింగ్ శాతం నమోదు

నవతెలంగాణ- నస్పూర్, మందమర్రి

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా సజావుగా జరిగాయి. బుధవారం ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్‌లో కార్మికులు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 5గంటల వరకు జరిగిన ఈ ఎన్నికల్లో సింగరేణి వ్యాప్తంగా 95శాతం పోలింగ్ నమోదైంది. ఆయా సంఘాలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఉత్కంఠ రేకెత్తించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాల సమీపంలో కార్మికులు, సంఘాల నాయకులతో సందడి వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి 7గంటలకు లెక్కింపు ప్రారంభం కాగా పూర్తి ఫలితాలు వెల్లడి కావాలంటే అర్ధరాత్రి సమయం పట్టవచ్చని చెబుతున్నారు.

పోలింగ్ తీరు ఇది..!

శ్రీరాంపూర్ ఏరియాలో 9124 ఓటర్లకు గాను 8491 కార్మికులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో శ్రీరాంపూర్ డివిజన్ 93శాతం నమోదైంది. అత్యధికంగా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌లో 576 ఓటర్లకుగాను 555 కార్మికులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 96.4 పోలింగ్ శాతం నమోదైంది. అత్యల్పంగా ఆర్కే-6లో 893 ఓట్లకుగాను 821 కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 91.9శాతం నమోదైంది. మందమర్రి ఏరియాలో మొత్తం 4835 మంది కార్మిక ఓటర్లకుగాను 4515 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏరియాలో మొత్తం 93.38 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు. బెల్లంపల్లి డివిజన్‌లో 996ఓట్లకు గాను 959ఓట్లు పోలయ్యాయి. 96.30శాతం నమోదైంది. డివిజన్ల వారీగా ఓట్ల లెక్కింపు చేపట్టారు.



మందమర్రిలో ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న మహిళా ఓటర్లు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | డిసెంబర్ 28, 2023 | www.navatelangana.com

మంత్రి సీతక్కను కలిసిన జర్నలిస్టులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ అర్బన్



రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్కను) జిల్లా జర్నలిస్టు జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రజాసేవాభవన్‌లో కలిసి సమస్యలు విన్నవించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించడంతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. స్పందించిన ఆమె ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో జేఏసీ ఛైర్మెన్ నూకల దేవేందర్, సీనియర్ జర్నలిస్టులు బిర్యార్‌వార్ వెంకటేష్, రాజశేఖర్‌జోషి, ఏర సుధాకర్, మెడపట్ల సురేష్, దేవిదాస్, అంజయ్య, సుభాష్, సిడాం రవి, అస్మత్, అరుణ్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, పసుపుల స్వామి తదితరులున్నారు.

ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి సన్మానం

నవ తెలంగాణ-నిర్మల్



కుమ్మరి జాగృతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురగా పరిష్కరించేల చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు భూసారపు గంగాధర్, నియోజకవర్గ అధ్యక్షులు కొత్తపల్లి రఘు, ప్రధాన కార్యదర్శి రాజారపు శ్రీనివాస్, పోతుగంటి రమేష్, రాజారపు పరమేశ్వర్, పోతుగంటి సాయి, ఆమెడ సాయన్న, తోడిశెట్టి గంగాధర్, తోడిశెట్టి సతీష్ సిలారి మధు పాల్గొన్నారు.

యాసంగి పంటకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నిర్మల్

శ్రీరామ్ సాగర్ జలాశయం నుండి సరస్వతి కాలువ పరిధిలోని ఆయకట్టు రైతులకు యాసంగి పంటకు సాగు నీటిని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి బుధవారం విడుదల చేశారు. ముందుగా గంగమ్మ తల్లికి పూజలు చేసి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ రైతులు యాసంగిలో పంటలు సాగు చేసేందుకు ఎస్సారెస్పీ ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. రైతులు చెరువులను నింపుకొని పంటలు సాగు చేసుకోవాలని కోరారు. సరస్వతి ఆయకట్టు పరిధిలోని రైతులు ప్రతినీటి చుక్కనూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సుశీల్ కుమార్, ఈఈ రమణ రావు, సోన్, లక్ష్మణచందా ఎంపీపీలు హరీష్ రెడ్డి, అడ్వాల రమేష్, నాయకులు అంజుకుమార్ రెడ్డి, నల్లా ఇంద్రకరణ్ రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సరికేల గంగన్న, మార గంగారెడ్డి, అశోక్, జక్క రాజేశ్వర్, రమేశ్ రెడ్డి, మారుతి, అంజయ్య, నాగరాజు, నవీన్, ఎల్లయ్య, నర్సయ్య, ముత్యం రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఉదయ్ పాల్గొన్నారు.

2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా నిలపడమే లక్ష్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో 2047 నాటికి దేశాన్ని వికసిత్ భారత్‌గా అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తూ అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాలని ఎంపీ సోయం బాపురావు సూచించారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో వికసిత్ భారత్ సంకల్పయాత్రను ఆయన ప్రారంభించారు. పీఎం మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాలు, ఎవరు వీటికి అర్హులు అనే పూర్తి సమాచారాన్ని అట్టడుగు స్థాయి వర్గాల ప్రజలకు వివరంగా చెప్పేందుకే ఈ కార్యక్రమాన్ని రూపొందించడమైనదన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలు తెలుసుకుంటు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం లబ్ధిదారులకు ఉజ్వల పథకం కింద సిలిండర్లు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలు, గోడప్రతులు, క్యాలెండర్లను ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రచార వ్యానును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, ఎల్‌డీఎం కె.ప్రసాద్, ఓఎంసీ డీఎస్‌ఓ మహేష్ మిట్ట అధికారులు, బీజేపీ నాయకులు సుహాసిని రెడ్డి, ఆధినాథ్, పాయల శరత్ పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని ఎఎంసీ వైస్ ఛైర్మెన్ తొడసం నాగోరావ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసి బుధవారం వినతిపత్రం అందించారు. తాడిహత్నూర్ నుండి నార్నూర్, నార్నూర్ నుండి గాదిగూడ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం, మండలంలోని కొత్తపెల్లి హెచ్, ఎంపల్లి, మరప్పగూడ, మలంగి గ్రామాల్లో చెరువుల నిర్మాణం, మండల కేంద్రంలో ఆదివాసీ ఆరాధ్య దైవం ఖాందేవ్ ఆలయానికి, జంగుబాయి ఆలయ అభివృద్ధికి, కొత్తపెల్లిలో దీక్ష భూమి, సేవాలాల్ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. తాడిహత్నూర్‌లో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఆయనతో సర్పంచుల సంఘం అధ్యక్షులు యుర్వేత రూపదేవ్, సర్పంచులు, నాయకులు గోపాల్, కుమ్ర రాహుల్, మడావి రూపదేవ్, రాథోడ్ రామేశ్వర్, రాథోడ్ విష్ణు, రాథోడ్ రవీందర్, ఫడ్ విష్ణు, కనక ప్రభాకర్, మడావి పైకు ఉన్నారు.

అడవిపంది మాంసం విక్రయించిన ఇద్దరి రిమాండ్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇంద్రవెల్లి అటవీ రేంజ్ పరిధిలో అడవి పందిని చంపి మాంసం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎఫ్‌ఆర్‌ఓ సంతోష్ తెలిపారు. మండలానికి చెందిన చవాన్ ఉమా, నల్కాజ్ దత్తతురి ఇద్దరు అటవీ పంది మాంసం విక్రయిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. వీరిపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి బుధవారం బోథ్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచగా రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీకి సన్మానం

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలం ఎంపీపీ బాయమొల్ల లలిత బోజన్న అనారోగ్యానికి గురవడంతో ఆమె స్థానంలో వైస్ ఎంపీపీ మామిడి నారాయణ రెడ్డి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యాం సుందర్, పీఏసీఎస్ ఛైర్మెన్ రత్నాకర్ రావు, డైరెక్టర్స్ సుధీర్ రెడ్డి, శ్రీనివాస్, ఎంపీటీసీ సాయ రెడ్డి, పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ బండి ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను గురువారం జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్టు మహిళా, శిశ, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ మిల్కా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకలకు జిల్లాలోని దివ్యాంగుల అసోసియేషన్ సభ్యులు, నాయకులు, దివ్యాంగ స్వయం సహాయక గ్రూప్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎవరి వ్యూహం వారిదే..!

- విశ్వాసమా..? అవిశ్వాసమా..?
- రసవత్తరంగా ఖానాపూర్ మున్సిపల్ రాజకీయం



ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయం

నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

ఖానాపూర్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌పై అవిశ్వాసం నోటీసుతో మున్సిపల్ రాజకీయం రసవత్తరంగా మారింది. చైర్మెన్ పదవీ కాలం పూర్తి కావడానికి మరో ఏడాది ఉంది. ఈ సమయంలో చైర్మెన్‌పై మెజార్టీ కౌన్సిలర్లు చేసిన అవిశ్వాస తీర్మాణం ఆయనకు సమస్యగా మారింది. అవిశ్వాస గండం నుంచి బయట పడడం కోసం చైర్మెన్ అంకం రాజేందర్ ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు. చివరి ఏడాది కాలంలో పదవి కాపాడుకోలేని అసమర్థుడనే అపవాదును భరించడం కంటే, అవిశ్వాసం వీగిపోయే విధంగా ప్రణాళికతో ఉన్నట్లు సమాచారం. చైర్మెన్‌ను పదవి నుంచి తప్పించడం తప్పితే ఇంకో ఆలోచన లేని 9 మంది సభ్యులు మాత్రం తమ బల పరీక్షను నిరూపించడానికి సంసిద్ధంగా ఉన్నారు. తొమ్మిది మంది సభ్యులు ఒక వైపు, చైర్మెన్, వైస్ చైర్మెన్, ఓవార్డు కౌన్సిలర్ ఓ వైపుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అవిశ్వాసం నుంచి భయట పడేందుకు చైర్మెన్ అంకం రాజేంధర్ 9 మంది సభ్యుల్లో నుంచి ఇద్దరు సభ్యులను తన వైపునకు మళ్లించుకునే వ్యూహంతో ఉన్నట్లు తెలిసింది. అదే జరిగితే అంకం రాజేంధర్‌పై అవిశ్వాసం వీగిపోయే అవకాశం ఉంది.

వైస్ చైర్మెన్ సైతం అసంతృప్తి

నాలుగేండ్ల పాలనలో చైర్మెన్ అంకం రాజేందర్ ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్న విమర్శలను ఉన్నారు. తనతో ఉంటే రాజకీయ ఉనికికే నష్టం కలుగుతుందన్న భావనలో వైస్ చైర్మెన్ ఖలీల్ దూరంగా ఉంటున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. చైర్మెన్‌పై పలువురు మెజార్టీ సభ్యులు చేస్తున్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆ మరక తనకు అంటకుండా వైస్ చైర్మెన్ ఖలీల్ జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు చెబుతున్నారు. మెజార్టీ సభ్యులు విభేదిస్తున్న చైర్మెన్‌తో జతకట్టి సమస్యల్లో ఇరుక్కోవడం కంటే దూరంగా ఉండడమే మేలన్న అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. చివరికి వైస్ చైర్మెన్ ఖలీల్ వైఖరి ఎలా ఉంటుందో చూడాలి.

పదవీ గండం తప్పేనా..?

మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ జనవరి 5న అవిశ్వాస పరీక్షను ఎదుర్కోనున్నారు. ఆగండం నుంచి బయట పడితే గాని ఆయన పదవిలో కొనసాగే అవకాశం లేదు. ఈ క్రమంలో తొమ్మిది మంది మెజార్టీ సభ్యుల నుంచి ఇద్దరినీ బల నిరూపనకు హాజరు కాకుండా పావులు కదుపుతున్నట్లు సమాచారం. అవిశ్వాస నోటీసు ఇచ్చిన ఆరు నెలల నుంచి పట్టించుకోని అంకం రాజేందర్ చివరి సమయంలో సీరియస్‌గా తీసుకోవడం చర్చానీయాంశమవుతోంది.

సమస్యల వలయంలో గాదిగూడ కేజీబీవీ

- ఫర్నిచర్ లేకుండా నేలపైనే విద్యార్థినులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఫర్నిచర్ లేకపోవడంతో నేలపైనే కూర్చున్న విద్యార్థినులు

నవతెలంగాణ-నార్నూర్

నూతనంగా ఏర్పడిన మండలాల్లో సమస్యలు రాజ్యమేలుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యకు పెద్ద పీటవేశామని చెబుతూ గిరిజన ప్రాంతాల్లోని విద్య సంస్థలను గాలికి వదిలేసింది. నూతనంగా ఏర్పాడిన గాదిగూడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేజీబీవీ కేటాయించారు. భవనం కూడా మంజూరు చేశారు. రెండేండ్లగా అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ విద్యను ప్రారంభించారు. ప్రస్తుతం ఇక్కడ ఆరు నుండి పదవ తరగతిలో 243 మంది, కళాశాలలో 95 మంది విద్యార్థినీలు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలకు భవనం ఉన్న ఫర్నిచర్ లేని కారణంగా నేలపైనే కూర్చోనే పాఠాలు వింటున్నారు. రక్షణ కోసం ప్రహరీ గోడలు లేదు, ప్రస్తుతం



చలి తీవ్రత ఎక్కుడగా ఉంది వాటర్ హిటర్లు లేక చల్లటి నీటితో విద్యార్థినీలు స్నానాలు చేస్తున్నారు. అనేక సమస్యల నడుమ గిరిజన విద్యార్థులు వారి చదువును ముందుకు సాగించలేకపోతున్నారు. దీనికి కళాశాలలో అధ్యాపకులు లేక బోధనలు సాగడం లేదని విద్యార్థినీలు అంటున్నారు. పరీక్షలు దగ్గర పడడంతో ఉట్నూర్ నుండి అధ్యాపకులు వచ్చి తరగతులు నిర్వహిస్తున్న దుస్థితి ఉంది. ప్రభుత్వం, అధికారులు కేజీబీవీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినీలు, పోషకులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఎస్ఓ ప్రియాంక

పాఠశాలలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఒక్కోక్కటి పరిష్కారమవుతాయి. ల్యాబ్‌కు సంబంధించిన ప్రొసిడింగ్ వచ్చింది. ఫర్నిచర్, అధ్యాపకుల సమస్యలను త్వరగ పరిష్కరించాలని విన్నవించాం. త్వరలోనే మౌళిక వసతులు, అధ్యాపకుల నియామకం అవుతుది.

రాష్ట్ర మంత్రి సీతక్కకు వినతుల వెల్లువ



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) వచ్చారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా బుధవారం జిల్లాకు వచ్చారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం బయటకు వచ్చిన మంత్రిని ఆయ సంఘాలు, యూనియన్ నాయకులు వారి సమస్యలను విన్నవిస్తూ వినతిపత్రాలు అందించారు. ఓపికగా వారి సమస్యలను వింటూ వినతిపత్రాలను మంత్రి స్వీకరించారు.

ఇంటి పట్టాలు ఇవ్వాలని తుడుందెబ్బ నాయకులు

జిల్లా కేంద్రంలోని కుమురం భీం కాలనీలో గూడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న ఆదివాసీలు పట్టాలివ్వాలని తుడుందెబ్బ జిల్లా కమిటీ సభ్యులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. మావల మండలం బట్టిసవర్గం శివారం సర్వే నంబర్ 72/23 ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న ఆదివాసులకు ఇంటి స్థలాలకు పట్టాలు మంజూరు చేసి మౌళిక వసతులు కల్పించాలని తుడుం దెబ్బ రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు గోడం గణేష్ కోరారు.

ఔట్ సోర్సింగ్ అటెండెర్స్ అండ్ డ్రైవర్స్ నాయకులు

ఉపాధి హామీ పథకంలో పనిచేయుచున్న ఔట్ సోర్సింగ్ అటెండెర్స్ అండ్ డ్రైవర్స్ ఉమ్మడి జిల్లా యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనేక ఏండ్లుగా చాలిచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నామన్నారు. హెచ్‌ఆర్ పాలసీ కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఇందులో ఉమ్మడి జిల్లా సభ్యులు అసిఫ్, మురద్, సాయి, రవీందర్ సింగ్, అశోక్ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులు

పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు రాష్ట్ర మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఓపిఎస్ వ్యవస్థను రద్దు చేయాలని, సమ్మె కారణంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్‌ను ఇంతవరకు విధుల్లోకి తీసుకోలేదని ఆయనున్న విధుల్లోకి తీసుకోవాలని విన్నవించారు. స్పోర్ట్స్ కోటాలో జేపీఎస్‌లుగా విధుల్లోకి వచ్చిన వారిని కోర్టు ఆర్డర్ ప్రకారం 73 మందికి తిరిగి విధులకు తీసుకుని రెగ్యులర్ చేయాలని అన్నారు.

టీఎమ్మార్పీఎస్ నాయకులు

జిల్లాలోని ఎస్సీ వసతిగృహాల్లో సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేయాలని టీఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోలార్ వాటర్ హీటర్ లేని కారణంగా చలికాలంలో చల్లటి నీటితో స్నానాలు చేస్తు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారన్నారు. స్పందించి ఎస్సీ వసతి గృహాల్లో సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందులో అధ్యక్షులు మల్యాల మనోజ్, రాందాస్, నాయకులున్నారు.

జిల్లా ఉపాధి హామీ ఉద్యోగుల సంఘం నాయకులు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. 2006 నుండి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉపాధి పథకంలో చాలీచాలని వేతనాలతో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్నామన్నారు. ఉద్యోగ భద్రత, పదోన్నతులు లేవన్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ తమ కుటుంబాలను ఆదుకునేల క్రమబద్ధీకరించాలని కోరారు. ఇందులో సంఘం నాయకులు రాజు, నరేందర్ ఉన్నారు.



మంత్రికి వినతిపత్రం అందించి సమస్యలు తెలియజేస్తున్న తుడుం దెబ్బ నాయకులు

ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం చేయాలి



నవ తెలంగాణ-తాంసి

నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజలకు చేరే విధంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత అధికారులపై ఉంటుందని వైస్ ఎంపీపీ ముచ్చరేఖ అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాలపై 28 నుంచి జనవరి 6వ తేది వరకు ప్రజా పాలన ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తుందన్నారు. గ్రామాల్లో నిర్వహించే సభల్లో ప్రజలు వారి దరఖాస్తు ఫారాలను పూరించి అధికారులకు అందించాలన్నారు. అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు ఆయా గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, సూపరింటెండెంట్ రవీందర్, ఎంపీఓ సుధీర్ రెడ్డి, మండల వైద్యాధికారి శ్రావ్య సర్పంచులు ఎంపీటీసీలు, కార్యదర్శులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నార్నూర్ : 28 నుండి జనవరి 6 వరకు నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ రాజలింగం, సూపరింటెండెంట్, ఇన్‌చార్జి ఎంపీఓ గంగాసింగ్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. దరఖాస్తులను కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తుదారుల స్వీకరించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీపీ కనక మోతుబాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామపంచాయతీల్లో ప్రజా పాలన సభలు కట్టుదిట్టంగా నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఎంపీఓ మహేందర్ రెడ్డి, ఎంపీపీ అజాడే జయశ్రీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులకు ప్రజా పాలన కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు షెడ్యూల్ గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

తలమడుగు : మండలంలోని సుంకిడి గ్రామ రైతు వేదికలో బుధవారం ఎంపీఓ దిలీప్ కుమార్ మండల గ్రామపంచాయతీ కార్యదర్శులతో ప్రజా పాలన కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ దిలీప్ కుమార్ మాట్లాడుతూ లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖ అధికారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమం యధావిధిగా నాలుగు నెలలకు ఒకసారి నిర్వహిస్తామన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ఈ సమావేశంలో సర్పంచులు మహేందర్ యాదవ్, రాంబాయి, పంచాయతీ కార్యదర్శులు అశోక్, అనిల్ రెడ్డి, వినోద్, శివకుమార్, సుజాత పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తాం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ , జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. బుధవారం ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే వెడ్మ బోజ్జుతో కలిసి ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపాన్ని దర్శించుకున్నారు. అమరవీరులకు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన ఆరు గ్యారంటీ పథకాలను వంద రోజులలోపు అమలు చేసి తీరుతామన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని కాంగ్రెస్ పూర్తి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడిగా ఈ అమరవీరుల స్థూపాన్ని సందర్శించారని గుర్తు చేశారు. అమరవీరుల కుటుంబాలకు కాంగ్రెస్ ఆదుకుంటుందని పేర్కొన్నారు. స్థూపం వద్ద స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై పలువురు మంత్రికి విన్నవించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెస్రం నాగ్‌నాథ్, ముకాడే ఉత్తం, ఆత్రం అశోక్ ఉన్నారు

ప్రజల కోసం నిరంతరం పని చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ప్రజల పక్షాన నిలబడుతూ వారికి అన్ని విధాలా అండగా నిలబడాలని, కార్యకర్తలు అధైర్యపడకుండా ప్రజల కోసం నిరంతరం పని చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న సూచించారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైతే స్పందించాలని, ప్రజల గొంతుకగా నిలబడాలన్నారు. ఎన్నికల్లో నైతికంగా ఓడిపోలేదని, పదివేల కంటే తక్కువ మెజారిటీతో కేవలం పది మంది బీఆర్ఎస్ అభ్యర్థులు మాత్రమే ఓడారని అన్నారు. కార్యకర్తలు నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇచ్చిన మాట ప్రకారం వెంటనే అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో ప్రభుత్వ పనితీరును ఎండగట్టాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మెట్టు ప్రహ్లాద్, సాజిదోద్దీన్, రాజేశ్వర్, లింగారెడ్డి పాల్గొన్నారు.

కుటుంబాన్ని పరామర్శించిన మిత్ర బృందం

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్‌లోని శ్రీరామ్ నగర్‌లో నివాసముంటున్న ఎంజాల నరేష్ క్యాన్సర్ వ్యాధితో ఇటీవల మరణించాడు. బుధవారం ఆయన మిత్ర బృందం నరేష్ మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. భార్య, ముగ్గురు పిల్లలను పరామర్శించి ధైర్యం చెప్పారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వ్యక్తిగత సహాయకులు కృష్ణం రాజు నిత్యావసర సరకులు అందించారు.

నేటి నుండి ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరణ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటి కార్డుల దరఖాస్తులను గురువారం నుంచి మున్సిపాలిటీలోని 22 వార్డులలో ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ జి.వేంకటనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రజాపాలన కార్యక్రమం ఈ నెల 28 నుండి జనవరి 6వ తేదీ వరకు 8 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వ 5 గ్యారెంటీలు అయిన మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పనులు పథకాల దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాసిపేట గనులను సందర్శించిన జనక్‌ప్రసాద్

నవతెలంగాణ-కాసిపేట



మందమర్రి ఏరియాలోని కాసిపేట-1,2 గనులపై నిర్వహించిన ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలను ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్ పరిశీలించారు. యూనియన్ నాయకుల తో కార్మికులకు తో పోలింగ్ శాతంపై చర్చించి మనమే గెలుస్తామని, ఇచ్చిన 6 గ్యారెంటీలు 100 శాతం నేరవేరుస్తామని అన్నారు. ఆయన వెంట ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమయ్య, సెంట్రల్ కమిటీ సెక్రటరీ రాపర్తి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, సిద్ధం తిరుపతి పాల్గొన్నారు.

గుండెపోటుతో సింగరేణి కార్మికుడు మృతి

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణిలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుకు గురై బుధవారం మృతి చెందాడు. శ్రీరాంపూర్ ఏరియా లోని వర్క్ షాప్‌లో విధులు నిర్వహిస్తున్న విలాసారపు శ్రీనివాస్(34) అనే సింగరేణి కార్మికుడు విధులు నిర్వహిస్తున్న సమయంలోనే చాతి నొప్పి రావడంతో ఆర్కే-8 డిస్పెన్సరీకి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స నిమిత్తం సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనివాస్ ఆర్కే-6 గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆర్కే-6 గని నుంచి డిప్యూటేషన్ పై ఏరియా వర్క్ షాప్‌కి వచ్చి విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన మృత్యువాత పడటంతో వర్క్షాపులో విషాదఛాయలు అలముకున్నాయి. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి మృతదేహాన్ని సందర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంతేకాకుండా సింగరేణి సంస్థ వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా తోడు ఉంటుందని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



నవతెలంగాణ-జైపూర్

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జిగా జిల్లా పర్యటనకు వచ్చిన సీతక్క(అనసూర్య) చెన్నూర్ నియోజకవర్గం అభివృద్ధికి శాఖ పరంగా తనవంతు కృషి ఉంటుందని తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ వెలుతున్న క్రమంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్భంగా వివేక్ వెంకటస్వామి నివాసానికి వచ్చిన సీతక్క ఎమ్మెల్యే ఇంటిలో అల్పాహార విందు చేశారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు సీతక్కను కలిసి శాలువాలతో సన్మానించారు.

యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

యాదవ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం మండల కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జక్కుల తిరుపతి ప్రధాన కార్యదర్శి సంఘ అంజిత్, ఉపాధ్యక్షులుగా వంగ శ్రీనివాస్, బైరీ తిరుపతి, కార్యదర్శులుగా ఎల్లముల రాజశేఖర్, కోశాధికారిగా మింగని మహేష్, ముఖ్య సలహాదారులుగా, పెన్కర్ల రాజమల్లు సలహాదారులుగా, జక్కుల శంకర్ బైరి గంగన్న, జక్కుల బాలు సత్తన్న, వంద లక్ష్మణ్ గంగుల తిరుపతి, తొట్ల తిరుపతి ఎల్ఎంల శ్రీకాంత్, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా నాయకులు గట్టు మహేష్, పిండి నరేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాపాలన గ్రామసభలు

నవతెలంగాణ-వాంకిడి

నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన గ్రామ సభలను ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు బుధవారం ఎంపీడీఓ శివకుమార్ తెలిపారు. 28న వాంకిడి, కమాన, ఇందాని, బంబారా, 29న కన్నర్‌గావ్, కోమటిగూడ, నవెదరి, కిర్డీ, 30న లక్ష్మీపూర్, వెల్గీ, సోనాపూర్, సవాతి, జనవరి 2న తెగాపూర్, బెండారా, చిచ్‌పెల్లి, నవెగూడ, 3న తమేశా, జంబుల్‌దరి, జైత్‌పూర్, గోయగావ్, 4న సరండి, పాటగూడ, లేండిగూడ, నవెగాం, 5న పిప్పర్‌గొంది, చౌప్పన్‌గూడ, డాబా, లొద్దిగూడ ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామసభలకు ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు తరలింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధర్వంలో కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నిర్వహించిన కంటి శిబిరంలో అవసరం ఉన్నవారిని బుధవారం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ కొత్తపల్లి అనిత అధ్వర్యంలో 15 మందికి ఆపరేషన్ నిమిత్తం భోజనం సదుపాయం, ప్రయాణ చార్జీలు సమకూర్చి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది గోపి పాల్గొన్నారు.

జంతుశాస్త్ర అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో జంతు శాస్త్రం (జువాలజీ) భోధించుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో జంతు శాస్త్రం బోధించుటకు ఆసక్తి గలవారు ఈ నెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో డెమోకి హాజరు కావాలని సూచించారు. జువాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి ఉండాలని, బీఈడి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, వేతనం గరిష్టంగా నెలకు రూ.18200 ఉంటుందని తెలిపారు.

చౌప్పన్‌గూడలో కబడ్డీ పోటీలు

వాంకిడి : మండలంలోని చౌప్పన్‌గూడ గ్రామంలో బుధవారం కబడ్డీ పోటీలను జడ్పీటీసీ అజయ్‌కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపుకు నాందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వినోద్, బీఆర్ఎస్ నాయకులు కులకార్, బాపురావు, మహాదు, భీంరావు, మెంగు, సంఘం నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా సమాఖ్య కార్యాలయంలో మాట్లాడుతున్న రాణి

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది సూచించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రాణి మాట్లాడుతూ మహిళలు వారు అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి స్వతహాగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగడమే మహిళా సాధికారత అన్నారు. మహిళలపై జరిగే హింసల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇళ్లల్లో జరిగే హింసలు, బయట ఎదురయ్యే హింసలు, అత్యాచారాలు, పని ప్రదేశాలలో మహిళలు ఎదురుకుంటున్న లైంగిక, శారీరక, మానసిక, ఆర్థిక పరమైన వేధింపులకు లోనైనప్పుడు వారు ఆందోళన చెందకుండా ధైర్యంగా ముందుకు వచ్చి వారి సమస్యను చెప్పుకుని పరిష్కరించుకునేలా ప్రతీ మహిళా ధైర్యంగా ముందుకు రావాలని కోరారు. వారి సమస్య చెప్పుకోడానికి ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181 ఉందన్నారు. బాల్యవివాహాలు చేయకూడదని ఎక్కడైనా జరిగితే అడ్డుకోవడం మన అందరి బాధ్యత అని చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కి ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షుడు శ్రీదేవి, కోశాధికారి అన్నపూర్ణ, డీపీఎంలు అన్నాజీ, యాదగిరి, సారయ్య, యశోద, ఏపీఎం మహిత పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేసిన టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



నవతెలంగాణ-కౌటాల

ఆర్థిక సాయం అందజేసిన టీఎస్ యూటీటీఎఫ్ నాయకులు చింతలమానేపల్లి మండలంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహించిన దుర్గ క్యాన్సర్ వ్యాధితో ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న యూటీఎఫ్ నాయకులు ఏఎన్ఎం దుర్గా పిల్లలకు బుధవారం రూ.33000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం హిందూ రావు మాట్లాడుతూ అనారోగ్యంతో గతంలోనే తండ్రిని కోల్పోయి కేవలం తల్లిపై ఆధారపడ్డ ఆ కుటుంబం దురదృష్టవషత్తు క్యాన్సర్ బారినపడి ఇటీవల తల్లి కూడా మరణించడం చాలా బాధాకరమన్నారు. ఇద్దరు పిల్లలు అనాధలుగా మిగలడంతో టీఎస్ యుటీఎఫ్ సభ్యులుగా జిల్లా కమిటీ పిలుపుమేరకు తమ వంతుగా సహాయాన్ని ఆ పిల్లలకు అందించడం జరిగిందన్నారు. ఆ పిల్లలు ప్రతి ఒక్క సభ్యులకు కేజీబీవీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ సామాజిక స్పృహ కలిగిన సంఘముగా ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంతో మానవీయ కోణంలో మరణించిన తమ సభ్యుల కుటుంబాలకు అండగా నిలబడటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కంపెల్లి ఊషన్న దుర్గయ్య సఫల్ అనిత కేజీబీవీ ఉపాధ్యాయులు పవిత్ర శిరీష పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని మీ సేవ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రభుత్వ నిబంధనలు పాటించని మీసేవ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టీకానంద్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కార్తీక్‌తో కలిసి కలెక్టరేట్ ఏఓ రఫత్ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మీ సేవా కేంద్రాలు ఎటువంటి నిబంధనలు పాటించడం లేదన్నారు. ప్రజల వద్ద నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తున్న మీసేవ సెంటర్ల యాజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 58 మీసేవ సెంటర్లు ఉన్నాయని, వాటిలో కొన్ని మీసేవ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తూ ప్రజల వద్ద నుంచి కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు, పానీలు ఇతర ఫారల కోసం అధిక డబ్బులు వసూలు చేస్తూ ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారన్నారు. వాంకిడి, కెరమెరి, ఆసిఫాబాద్‌లో ఇది ఎక్కువగా కొనసాగుతుందని వాంకిడి మండలంలో ఒకరి పేరుతో తీసుకున్న మరొకరు నడిపిస్తున్నారని ఆరోపించారు. వీటిపై కనీసం పర్యవేక్షణ చేయాల్సిన అధికారి కూడా సరిగ్గా పర్యవేక్షణ చేయడం లేదన్నారు. వెంటనే ఇటువంటి వాటిని గుర్తించి చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేయనున్న ఆరు గ్యారెంటీ పథకాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని గ్రామస్థాయి, మండలస్థాయి అధికారులకు కాగజ్‌నగర్ డీఎల్‌పీఓ సురేష్‌బాబు అవగాహన కల్పించారు. బుధవారం రైతువేదికలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామస్థాయి నుంచి అభివృద్ధి జరిగే విధంగా క్షేత్ర, స్థాయి అధికారులు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచే విధంగా ప్రభుత్వ పథకాలు అమలుచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జనాభా ప్రాతిపదికన కౌంటర్లు ఏర్పాటుచేసి బృందాలుగా ఏర్పడి దరఖాస్తులను స్వీకరించి రసీదు ఇవ్వాలన్నారు. ప్రజలకు సంబంధించిన ఏ సమస్యనైనా దరఖాస్తు ద్వారా తెలిపేలాగా వారికి అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరు సమన్వయంతో కృషి చేస్తేనే ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజేశ్వర్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బెంగాళీలకు ఎస్సీ సర్టిఫికెట్ జారీకి చొరవ తీసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సిర్పూర్ నియోజక వర్గంలోని బెంగాళీలకు ఎస్సీ సర్టిఫికేట్ ఇప్పించడంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని నౌకాయాన, ఓడరేవుల శాఖ మంత్రి శంతన్ ఠాకుర్‌కు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు విన్నవించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో కేంద్ర మంత్రిని బుధవారం ఎమ్మెల్యే కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిర్పూర్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో బెంగాలీ క్యాంపుకు విచ్చేసి బహిరంగ సభలో పాల్గొన్న మంత్రి శంతన్ ఠాకుర్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. స్థానికంగా ఉండే బెంగాళీలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం మాజీ ఎంపీ, జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ హంస్ రాజ్ గంగారాంను ఎమ్మెల్యే కలిశారు. ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చే ప్రక్రియకు తుదిరూపు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు రణ్వీర్ బిశ్వాస్, ఎంపీటీసీ బికాస్ ఘరామీ, జిల్లా అధికార ప్రతినిధి సమీర్ గుప్తా, సోషల్ మీడియా కన్వీనర్ అమిత్ బిశ్వాస్, మండల ప్రధాన కార్యదర్శి మృత్యుంజయ్ కవిరాజ్, రాకేష్ రాయ్, మహేష్ సింగ్ ఠాకుర్, సమీర్ దాస్ పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా : డ్రైవర్ మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండలంలోని అచ్చెల్లి గ్రామానికి చెందిన చింతకూరి సత్తయ్య(35) అనే ఆటో డ్రైవర్ ఆటో బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. బుధవారం కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకూరి సత్తయ్య స్వస్థలం దహెగాం మండలం తన అత్తగారి ఇల్లు అయిన అచ్చెల్లి గ్రామంలో ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఆటో తీసుకొని ఇంటి నుంచి సిర్పూర్‌కు వెళ్లి అక్కడ ప్రయాణికులను ఎక్కించుకొని చింతకుంట గ్రామానికి వెళ్లి ప్రయాణికులను దింపి తిరిగి వస్తున్న క్రమంలో అచ్చెల్లి గ్రామ శివారులో మూలమలుపు వద్ద అదుపుతప్పి ఆటో బోల్తాపడడంతో చాతిపై, మెడపై, కుడిచెవి కనతపై గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సెల్‌టవర్ బ్యాటరీలు చోరీ

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బెండారా గ్రామం వద్ద గల జియో సెల్‌టవర్ బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్టు ఎస్సై సాగర్ తెలిపారు. వాంకిడికి చెందిన ఉప్రె ఆకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేయడం జరిగిందన్నారు. బుధవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఉప్రె ఆకాష్ గత రెండు సంవత్సరాల నుంచి బెండారా వద్ద గల జియో సెల్‌టవర్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 24వ తేదీన పని ముగించుకొని ఇంటికి తిరిగి రాగా ఆదిలాబాద్ సంబంధిత సెల్‌టవర్ అధికారులు ఆయనకు ఫోన్ చేసి జియో నెట్ సమస్య ఉందని తెలపగా రాత్రి వెళ్లి చూడగా కేబుల్ కట్ చేసి ఉందని తెలిపారు. సెల్‌టవర్ నాలుగు బ్యాటరీలు కనిపించకపోవడంతో, నాలుగు బ్యాటరీల విలువ సుమారు రూ.48 వేలు ఉంటుందని జియో అధికారులు తెలపడంతో స్థానిక వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో ఆకాష్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసినట్టు తెలిపారు.

కాసిపేట-1,2 గనుల సందర్శన



నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి ఎన్నికల్లో భాగంగా మందమర్రి ఏరియా లోని కాసిపేట-1,2 గనులను బుధవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సదర్శించి పోలింగ్ తీరును తెలుసుకొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మైదం రమేష్ ఉన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్ ఏర్పాటు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకుకు వచ్చే దివ్యాంగుల కోసం బ్యాంకు మేనేజర్ బుధవారం వీల్ చైర్ ఏర్పాటు చేశారు. బ్యాంకుకు వెళ్లడానికి దివ్యాంగులకు ఇబ్బందిగా ఉందని చైతన్య దివ్యంగుల సంఘం అధ్యక్షుడు ఎండీ ఖ్యాయ్యుమ్ మేనేజర్‌కు విన్నవించడంతో వీల్ చైర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలని శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో ఐఎఫ్టియు యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా 11 డివిజన్లలో సుమారు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు చాలీ చాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, గత ప్రభుత్వాలు కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలపైన చర్చించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యకమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు పోచమల్లు, శంకర్, యాదగిరి, అప్పారావు, శేఖర్, శోభ, కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల కార్యదర్శి ఎన్నిక

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లి గ్రామానికి చెందిన మైదం రమేష్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కాసిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను ఎన్నుకొన్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, వార్డుమెంబర్ మంద వెంకటేష్ పాల్గొన్నారు.

జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలుగా లాలుబాయి

నవతెలంగాణ-జన్నారం



తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా జన్నారం డివిజన్‌లో బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న జి.లాలూ బాయి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పచెప్పిన వారికి రుణపడి ఉంటానని, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. నూతనంగా మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన లాలూ బాయిని తోటి ఉద్యోగులు, అటవీశాఖ అధికారులు అభినందించారు.

కమ్యూనిటీ కెమెరాల పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ ఎన్టీఆర్ మార్గ్‌లో కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను టౌన్ సీఐ పురుషోత్తం చారి, ఎస్సై రాజేశ్వర గౌడ్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం పట్ల కమ్యూనిటీ సభ్యులను అభినందించారు. అలాగే కెమెరాలు ఎల్లవేళలా పనిచేసేల చూసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలకు జియో ట్యాగింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు భూసారపు గంగాధర్, ప్రధాన కార్యదర్శి శివరాం వెంకటేష్, చిటిమల సదయ్య లింగంపల్లి లక్ష్మీనారాయణ, ఆడెపు సుధాకర్, సోలాపూర్ రాజేశ్వర్, సింగిడి భూషణ్ రెడ్డి, పద్మనాభం పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అన్నపూర్ణ జయంతి

నవతెలంగాణ-తాంసి



మండలంలోని బండల్ నాగపూర్ రామాలయంలో ఆలయ పూజారి రవి ఆధ్వర్యంలో బుధవారం అన్నపూర్ణ జయంతితో పాటు దత్త జయంతిని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గణపతి, నవగ్రహ పూజతో పాటు దాన్యరాసులకు ప్రత్యేక పూజలు, అమ్మవారికి పంచామృతలతో అభిషేకం చేశారు. సాక్షాత్తు పార్వతీ దేవియే అన్నపూర్ణ దేవిగా అవతరించిన రోజని పురాణాలు చెబుతున్నాయని ఆలయ పూజారి అన్నపూర్ణ దేవి జన్మదిన వృత్తాంతాన్ని భక్తులకు వివరించారు. గ్రామంలోని మహిళలు మంగళ హారతులతో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజుల శ్రీధర్ రెడ్డి, జడ్పీటీసీ రాజు, సర్పంచ్ వెంకన్న, గ్రామపెద్దలు కిష్టారెడ్డి రెడ్డి, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రశాంతం



రామకృష్ణాపూర్‌లో..



నస్పూర్‌లో..

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి గుర్తింపు ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగాయాయి. 9124 ఓటర్లకు గాను 8491 కార్మికులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో శ్రీరాంపూర్ డివిజన్ 93శాతం నమోదైంది. అత్యధికంగా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌లో 576 ఓటర్లకు గాను 555 కార్మికులు ఓటు హక్కు వినియోగించుకున్నాయరు. 96.4 శాతం నమోదు కాగా అత్యల్పంగా ఆర్కే-6 గనిలో 893 ఓట్లకు గాను 821 పోల్‌అయి 91.9 శాతం నమోదైంది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందబస్తు ఏర్పాటు చేశారు.

రామకృష్ణాపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు బుధవారం పోలీస్‌ల భారీ బందోబస్తులో ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక ఆర్కే ఓసి పీఓ కార్యాలయం, ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో సింగరేణి కార్మికులు, అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో రెండు పోలింగ్ కేంద్రాలల్లో 95 శాతం పోలింగ్ నమోదైంది.

కాసిపేట : మందమర్రి ఏరియాలోని కాసిపేట-1వ గని, కాసిపేట-2 ఇంక్లైన్ గనులపై సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కాసిపేట-1వ గనిలో రెండు పోలింగ్ బూత్లు, కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో రెండు పోలింగ్ బూతులు ఏర్పాటు చేయగా కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాసిపేట-1వ గనిలో 1204, కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో 874 మంది ఓటర్లు ఉండగా కాసిపేట-1వ గనిలో బూత్ నెంబర్ 3లో మొత్తం 613 ఓట్లకు గాను 540 ఓట్లు పోలవగా 88.09 శాతం పోలింగ్ నమోదైంది. బూత్ నెంబర్ 4లో మొత్తం 591 ఓట్లకు గాను 551 ఓట్లు పోలు కాగా 93.33 శాతం పోలింగ్ నమోదైంది. కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో బూత్ నెంబర్ 1 లో మొత్తం 461 ఓట్లకు గాను 439 ఓట్లు పోలు కాగా 95.23 శాతం పోలింగ్ నమోదైంది. బూత్ నెంబర్ 2 లో మొత్తం 413 ఓట్లకు గాను 391 ఓట్లు పోలు కాగా 94.67 శాతం పోలింగ్ నమోదైంది. బెల్లంపల్లి ఏసీపీ సదయ్య ఆధ్వర్యంలో తాండూర్ సి ఐ శ్రీనివాస్ రావు, ఎస్సైలు గంగారాం, ప్రశాంతు, ఆంజనేయులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీగా బందోబస్త్ నిర్వహించారు.

మందమర్రి : సింగరేణి గుర్తింపు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు మందమర్రి ఏరియాలో ప్రశాంతంగా జరిగాయి. బుధవారం జరిగిన ఎన్నికల్లో ఏరియాలో మొత్తం 4835 మంది కార్మిక ఓటర్లకు గాను 4515 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని 93.38 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు. ఏరియాలో 11 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఉదయం 7 గంటల నుంచి కార్మికులు ఉత్సాహంగా తమ ఓటు హక్కు వేసేందుకు వచ్చారు. ఫలితాలు తమకే అనుకూలంగా ఉంటాయని ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాల నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



కాసిపేటలో..



మందమర్రిలో..

మంత్రిని కలిసిన సమగ్ర శిక్షా ఉద్యోగులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి సీతక్కను తెలంగాణ సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. బుధవారం కలెక్టర్ సమావేశ మందిరంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ మాధవ్ కోరారు. సమ్మె కాలంలో ఇచ్చిన హామీ తొందరగా నెరవేర్చాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేసి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్, మీడియా కార్యదర్శి దేవదర్శన్, పార్థసారథి, నాగనాథ్, జావీద్, మంజుల పాల్గొన్నారు.

కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా కార్డెన్ సెర్చ్



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని కనకపూర్ గ్రామంలో బుధవారం బైంసా ఏఎస్పీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం ముధోల్ సిఐ వినోద్ రోడ్డు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ తదితర విషయాలపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రజల్లో భయన్ని తొలగించడానికి ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని తెలిపారు. సరైన పత్రాలు లేని 87 బైకులు, 2 కార్లు, 2 ఆటోలను సీజ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో లోకేశ్వరం, ముధోల్, తానూర్, బాసర ఎస్సైలు, బెటాలియన్ పోలీసులున్నారు.

కోసుపటేల్ గూడ పాఠశాలను దత్తత తీసుకున్న అభినవ్



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని సుంకిడి గ్రామ పంచాయతీ పరిధిలోని కోసుపటేల్ గూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సినీ ఇండస్ట్రీ నేత అభినవ్ సర్దార్ దత్తత తీసుకున్నారు. బుధవారం గ్రామాన్ని సందర్శించి పాఠశాల పరిస్థితి చూసి చలించి పోయారు. పూరి గుడిసెలో చదువుకుంటున్నారని తెలుసుకున్నారు. పాఠశాలను నిర్మించి జనవరి 26లోపు పూర్తయ్యేలా చూస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. తమ పిల్లల కష్టాన్ని గుర్తించి పాఠశాలను నిర్మిస్తున్నానని ఆయన తెలపడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఆత్మరం, గ్రామస్తులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి ఫూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలని అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఫూలే విశ్రాంతి భవనంలో మాట్లాడుతూ భారతదేశంలో స్త్రీ విద్యకు కృషి చేసిన ఆమె జయంతి జనవరి 3న అధికారికంగా నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజే ప్రగతి భవన్‌కి మహాత్మా జ్యోతిరావు ఫూలే ప్రజా భవన్‌గా మార్చడం హర్షణీయమన్నారు. పూలే దంపతుల జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించి సముచిత న్యాయం కల్పించాలన్నారు. జనవరి మూడవ తేదిన మాలీలు సావిత్రి బాయి జయంతిని ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు ఉమేష్ రావు డోలే, జిల్లా పటేళ్ల సంఘం అధ్యక్షులు గంగారాం శేండే, మాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ అంబేకర్, కార్యవర్గ సభ్యులు భాస్కర్ ప్రధాన్, సుభాష్ శేండే, శ్రీను ఆచారి, గజానన్ మొహుర్లే, జయరాం చౌదరి పాల్గొన్నారు.

నేటి నుండి ప్రజాపాలన

నవతెలంగాణ-జైపూర్

జైపూర్, భీమారం మండలాల్లో గురువారం నుండి వచ్చే నెల 3 వరకు గ్రామ పంచాయతీల వారీగా ప్రజా పాలన కార్యక్రమం కొనసాగుతుందని ఎంపీడీఓలు సత్యనారాయణ, శ్రీనివాస్ వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా గ్రామ పంచాయతీల వారిగా అర్హులైన లబ్ధిదారుల నుండి ధరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ముందుగా గ్రామీణులకు అవగాహన కల్పించడంతో పాటు వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. గ్రామ పంచాయతీల్లో పర్యటించే అధికారుల వివరాలు, కార్యక్రమానికి సంబంధించిన సమాచారం డప్పు చాటింపు ద్వారా తెలియజేస్తామని తెలిపారు.

జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-ఓదెల

ఓదెల మండలంలోని పిట్టల ఎల్లయ్యపల్లిలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే గెలిచిన తరువాత మొదటి సారి గ్రామానికి వచ్చిన సందర్భంగా సర్పంచ్ పిట్టల సరిత రవికుమార్ పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, రేషన్ కోసం గుండ్లపల్లి గ్రామానికి వెళాల్సి వస్తోందని, తమ గ్రామంలోనే రేషన్ షాపు ఏర్పాటు చేయాలని కోరారు. పిట్టల ఎల్లయ్యపల్లి గ్రామం నుండి గుండ్లపల్లికి బీటీ రోడ్ నిర్మించాలని, అంగన్‌వాడీ బిల్డింగ్, పాల ఉత్పత్తి దారుల సంఘానికి బిల్డింగ్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేను సర్పంచ్ కోరారు.ఈ సందర్భంగా జీపీ భవన నిర్మాణానికి రెండు గంటల భూమిని విరాళంగా ఇచ్చిన సర్పంచ్ పిట్టల సరిత రవికుమార్‌లను ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 28 నుంచి ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేల్పుల సరోజన,వార్డు సభ్యులు యాదగిరి స్వామి,ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్, రూప్ నారాయణపేట సర్పంచ్ అంకం రమేష్,నాయకులు గోపు నారాయణరెడ్డి, అంబాల కొము రయ్య, ఆళ్ళ సుమన్‌రెడ్డి, బొంగోని శ్రీనివాస్,చొప్పరి రాజయ్య, నీర్ల శ్రీనివాస్,యాదగిరి సమ్మయ్య, దొడ్ల బాపూరావు, అశోక్, కర్ర లక్ష్మారెడ్డి, పిట్టల సాగర్, బండారి శ్రీనివాస్, కంకణాల భాస్కర్‌రెడ్డి, వంగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలి

నవతెలంగాణ-జూలపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంచి విద్య అందిం చడంతో పాటు వారి మానసిక, శారీరక ఎదుగుదల జరిగేలా చూడాలని పెద్దపల్లి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం ఎలిగేడుమండలంలోని సుల్తాన్‌పూర్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. కిచెన్ గార్డెన్ పరిశీలించి పాఠశాలల పనితీరుపై ఉపాధ్యాయులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్ అందుబాటులో ఉన్న ఆన్‌లైన్‌ను వినియోగించి సమాజంలో వస్తున్న మార్పులు, మార్కెట్‌లో వస్తున్న కొత్త టెక్నాలజీ, నూతన ఉపాధి రంగాలు మొదలగు అంశాలను విద్యార్థులు తెలుసు కోవాలని ఆయన సూచించారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల లోని ఉపాధ్యాయులు ప్రణాళికా బద్ధంగా బోధన చేపట్టాలని, ప్రతి ఉపాధ్యా యుడు బోధించాల్సిన పాఠ్యాంశాలపై వార్షిక, నెలవారి ప్రణాళిక తయారు చేసుకుని టి.ఎల్.ఎం ప్రకారం కట్టుదిట్టంగా బోధన చేయాలన్నారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే పేరెంట్, టీచర్స్ సమావేశంలో విద్యాబోధనపై డెమో నిర్వహించాలన్నారు. ఇంటి వద్ద పిల్లలు కొంత సమయం చదువుపై దృష్టి సారించే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాల్సిన అంశాన్ని వివరించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులను త్వరలో సమీకృత జిల్లా కలెక్టరేట్ సంద˘ర్శన కోసం తీసుకురావాలని, జిల్లా యంత్రాంగం పని చేసే తీరును పరిశీలించి కొంత సమయం ఆహ్లాదకరంగా గడుపుతారని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, ప్రధానో పాధ్యాయులు, టీచర్లు, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు భూమి ఆక్రమిస్తే చట్ట పరమైన చర్యలు

- భూర్గుపల్లి శివారు కిష్టయ్య కుంట శిఖం పరిశీలించిన అధికారులు



శిఖం భూమిని పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-జైపూర్

నీటి పారుదల శాఖ పరిధిలో గల చెరువులు, కుంటల శిఖం భూములు ఆక్రమించాలని ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఈ శారద హెచ్చరించారు. భీమారం మండలం భూర్గుపల్లి శివారులో గల కిష్టయ్య(కుంట) చెరువు శిఖం భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసి బుధవారం స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. సుమారుగా 40 నుండి 50 ఎకరాల ఆయకట్టు కలిగి ఉన్న కిష్టయ్య కుంటలో ప్రస్తుతం 10 ఎకరాల 39 గుంటలు ఉన్నట్లు గుర్తించగా రికార్డులను పోల్చిచూస్తే మొత్తం విస్తీర్ణం తెలుస్తుందని తెలిపారు. మండల పరిధిలో నీటి పారుదల శాఖ పరిధిలో చెరువుల వివరాలు, చెరువులు, కుంటల్లో గల విస్తీర్ణం రెవెన్యూ అధికారులకు ముందస్తు సమాచారంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. భూర్గుపల్లి శివారులో గల కిష్టయ్య (కుంట) చెరువు భూమి ఆక్రమించుకోవడానికి ప్రయత్నించిన భూమి స్పష్టంగా చెరువు శిఖంలో ఉన్నట్లు వెల్లడించారు. ఒక వేళ చెరువు శిఖం భూమిలో పట్టాలు పొందిన వారు ఎవరైనా ఉంటే వారు పొరబడినట్టేనని, రెవెన్యూ రికార్డులతో పొందుపర్చిన సర్వే నెంబర్ భూమి ఎక్కడ ఉందో సరి చేసుకోవాల్సిన బాధ్యత సంబంధిత రైతులదని పేర్కొన్నారు.

చెరువు శిఖంలో పట్టా భూమి

భూర్గుపల్లి శివారు కిష్టయ్య(కుంట) చెరువు శిఖంలో పట్టా భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. పట్టాదార్ పాసుపుస్తకాలు కలిగి ఉన్న కొందరు చెరువు భూమిని అనుభవించడానికి ప్రయత్నిస్తున్న తీరుతో ఇరిగేషన్ అధికారులతో కలిసి శిఖం భూమిని సర్వే చేయడంతో పాటు రికార్డులను పరిశీలించారు. సర్వే నెంబర్ 305లో గల శిఖం భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం పట్టా భూమిగా గుర్తించారు. ఇరిగేష్ అధికారుల వద్ద గల రికార్డులతో రెవెన్యూ రికార్డులను పరిశీలించాల్సి ఉంది. ప్రస్తుతం శిఖంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయరాదని హెచ్చరించినట్టు తహసీల్దార్ విశ్వంబర్ తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూర్ పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేసిన ఐదు యూనిట్లతో కిడ్నీకి సంబంధించిన వ్యాధిగ్రస్తులు వైద్య సేవలు పొందే అవకాశం ఏర్పడిందన్నారు. వైద్య సాయం కోరి వచ్చే వారికి వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనా రాంలాల్ గిల్డా, వైద్యారోగ్యశాఖ వైద్యులు అరవింద్, సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మహిళలు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి

నవతెలంగాణ-జగిత్యాల

మహిళ స్వశక్తి సంఘల సభ్యులు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నాబార్డు డీడీఎం మనోహర్ రెడ్డి అన్నారు. జగిత్యాల రూలర్ మండలం పోరండ్ల గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన స్పందన ఎన్ జి.ఓ. నాబార్డు ఆధ్వర్యంలో ఉచిత ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళ స్వశక్తి సంఘాల సభ్యులకు స్పందన సొసైటి వారు ముందుకు రావడం సంతోషాదయకమని పేర్కొన్నారు. నాబార్డు కూడా ఇందుకు సహకారం అందిస్తుందన్నారు. అలాగే గ్రామీణాభివృద్ధి శాఖ వారి సహకారాన్ని తీసుకొని ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్పందన సంస్థ ఆర్గనైజర్ శోభారాణి మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో గ్రామీణ మహిళల అభివృద్ధి కోసం వివిధ రకాల ఉచిత శిక్షణలు ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలం 15 రోజులు ఉంటుందని, శిక్షణ సమయంలో భోజనం, గౌరవ భత్యంతో పాటు శిక్షణ పూర్తి తరువాత నాబార్డు వారి ధ్రువీకరణ పత్రం అందజేస్తామని తెలిపారు. టి.లైఫ్ జిల్లా ఆర్గనైజర్ పొన్నాల. శిరీషరెడ్డి, సర్పంచ్ సంధ్యారాణి శ్రీనివాస్,ఎంపీటీసీ సౌజన్య తిరుపతి,ఉప సర్పంచ్ సునీత నరేష్, ఏపీఎం వోదెల. గంగాధర్, సి.సి.బి. రవీందర్, వీవోఏలు రమ, జయ, కవిత, చంద్రకళ, అధ్యక్షురాలు జ్యోతి పాల్గొన్నారు.

ఒక ఇంటికి ఒకే దరఖాస్తు సమర్పించాలి

- జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

నవతెలంగాణ-జగిత్యాల

నేటి నుంచి జిల్లాలోని గ్రామాల్లో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో ఒక ఇంటికి ఒకే దరఖాస్తు సమర్పించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. 28 నుంచి జనవరి 6 వరకు జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డులలో ప్రజా పాలన కార్యక్రమాలు నిర్వహించి అభయహస్తం పథకం క్రింద అర్హులైన లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ పథకం క్రింద మహలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, చేయూత క్రింద దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. గ్రామాల జనాభా ఆధారంగా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తామని పురుషులకు, మహిళలకు, దివ్యాంగులకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వారం ఆరోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలకు అధికా రులు, ప్రజల ముంగిటకు వెళ్లి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు వారికి పలు సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు గ్రామ, మండల, నియోజక, జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారని, షెడ్యూల్ ఖరారు చేయడం జరుగుతుందని తెలిపారు. మొదటి రోజు అనగా ఈ నెల 28న 57 గ్రామాలు, మున్సిపల్‌లోని అన్ని వార్డులలో అర్జీలను స్వీకరిస్తామని చెప్పారు. ఆయా రోజులలో కాకుండా స్థానిక పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డ్ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.